بِسۡمِ اللّٰہِ الرَّحۡمٰنِ الرَّحِیۡمِ نَحۡمَدُہٗ وَنُصَلِّیۡ عَلٰی رَسُوۡلِہِ الۡکَرِیۡمِ وَعَلٰی عَبۡدِہِ الۡمَسِیۡحِ الۡمَوۡعُوۡدِ

Full Text of Friday Sermon Hazrat Khalifatul Masih V, 17 April 2026 (Telugu)

# సత్యము ఆధారంగా దైవ ప్రవక్త హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం జీవిత చరిత్ర విశ్వాసభరిత ప్రస్తావన

**హజ్రత్ అమీరుల్ మొమినీన్ ఖలీఫతుల్ మసీహిల్ ఖామిస్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ 17.04.2026 తేదీన – మస్జిద్ ముబారక్ ఇస్లామాబాద్, టిల్‌ఫోర్డ్, (సర్రె) ఇంగ్లాండ్‌లో ప్రసంగించిన ఖుత్బా జుమా సారాంశం**

أَشۡهَدُ أَنۡ لَّا إِلٰهَ إِلَّا اللّٰهُ وَحۡدَهٗ لَا شَرِيۡكَ لَهٗ وَأَشۡهَدُ أَنَّ مُحَمَّدًا عَبۡدُهٗ وَرَسُوۡلُهٗ۔ أَمَّا بَعۡدُ فَأَعُوۡذُ بِاللّٰهِ مِنَ الشَّيۡطٰنِ الرَّجِيۡمِ۔
بِسۡمِ اللّٰهِ الرَّحۡمٰنِ الرَّحِيۡمِ ○ اَلۡحَمۡدُ لِلّٰهِ رَبِّ الۡعٰلَمِيۡنَ ○ الرَّحۡمٰنِ الرَّحِيۡمِ ○ مٰلِكِ يَوۡمِ الدِّيۡنِ ○ اِيَّاكَ نَعۡبُدُ وَاِيَّاكَ نَسۡتَعِيۡنُ ○ اِهۡدِنَا الصِّرَاطَ الۡمُسۡتَقِيۡمَ ○ صِرَاطَ الَّذِيۡنَ اَنۡعَمۡتَ عَلَيۡهِمۡ غَيۡرِ الۡمَغۡضُوۡبِ عَلَيۡهِمۡ وَلَا الضَّآلِّيۡنَ ○

తషహ్హుద్, తఅవ్వుజ్, ఫాతిహా అధ్యాయ పఠనానంతరం హుజూరె అన్వర్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ యూనుస్ అధ్యాయపు 17, 18వ సూక్తులను పఠించి ఇట్లు ఉపదేశించారు.

ఈ సూక్తుల అనువాదం ఏమిటనగా (ఇంకను) ఇట్లనుము "అల్లాహ్ (దీని స్థానములో వేరొక బోధ ఇచ్చు) ఇష్టమున్నచో నేను మీ ముందు దీనిని చదివి వినుపించు వాడను కాను. అతడు కూడ ఈ (బోధను) మీకు తెలియజేయువాడు కాడు. నేను మీలో దీర్ఘ కాలము వరకు నివసించితిని. అయినను మీరు తెలివిని ఉపయోగించరా"? అల్లాహ్‌పై నేరము మోపిన వాడు, అతని సంకేతములను అబద్ధమనిన వాని కంటే దుష్టుడెవడు. (మీరే తెలుపుడు) నిశ్చయముగా నేరస్తులు విజయము పొందరు.

హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం పవిత్ర జీవితంలోని వివిధ కోణాల గురించి ప్రస్తావన కొనసాగుతోంది. నేడు ఆయన సత్యత, నిజాయితీ, ధర్మనిరతి గురించి చర్చించబడుతుంది.

ఆయన జీవిత సంఘటనలలో సత్యతకు సంబంధించిన అత్యున్నత ఉదాహరణలు కనిపిస్తాయి. శత్రువులు సైతం ఆయన ధర్మనిరతి గురించి అత్యున్నత ప్రమాణాలను అంగీకరించకుండా ఉండ లేకపోయారు. తనను అనుసరించేవారు కూడా సత్యతలో అత్యున్నత ప్రమాణాలను నెలకొల్పాలని అల్లాహ్ ప్రవక్త హితవు పలికారు. కావున ఈ విషయంలో నేడు మనందరం ఆత్మపరిశీలన చేసుకోవాల్సిన అవసరముంది. మన జీవితంలోని ప్రతి క్షణంలో విజయానికి నమ్మకం కలిగించే మరియు మనకు ధర్మప్రచార మార్గాలను తెరిచేవి ఈ సత్యతపు అత్యున్నత ప్రమాణాలే.

హుజూరె అన్వర్ ఇట్లనిరి. దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం పవిత్ర జీవితాన్ని ప్రస్తావిస్తూ హజ్రత్ ముస్లిమ్ మౌఊద్ రజియల్లాహు అన్హు ఒక చోట ఇట్లన్నారు. దైవ ప్రవక్త (స) విషయంలో ఆయన శత్రువులు సైతం ఆయన్ను సత్యసంధుడు, నమ్మకస్థుడని అంగీకరించారని మనం గమనించవలెను. వారు ఆయనపై ఎటువంటి ఆరోపణలు చేయలేకపోయారు. శత్రువు కూడా ఆయన సత్యతకు మరియు పవిత్రతకు సాక్ష్యమిచ్చాడు.

హజ్రత్ మసీహ్ మౌఊద్ అలైహిస్సలాం ఇట్లనిరి. దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం గారి ఏ గుణం శత్రువులపై ప్రభావం చూపినది? శత్రువులు ప్రారంభంలో పవిత్ర ఖుర్‌ఆన్ ద్వారా ప్రభావితం కాలేదు, కానీ అది మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ప్రారంభ జీవితం. ప్రవక్త గారు వారి మధ్యనే నివసించారు. ఆయన దైవభీతి, నిజాయితీ, సత్యత, మానవత్వంపై ఆయనకున్న సానుభూతి మరియు ఆయన త్యాగనిరతే శత్రువులపై గాఢమైన ప్రభావం చూపాయి. ప్రవక్తగా ప్రకటించుకోకముందు

ఆయన వారిని విగ్రహారాధన నుండి వారించలేదు, ఎందుకంటే అప్పటికి దైవాజ్ఞ రాలేదు. కానీ ఆయన స్వయంగా ఎప్పుడూ విగ్రహారాధన చేయలేదు. ఆయన ఉత్తమ ప్రవర్తన, పద్ధతులే వారిపై ప్రభావం చూపాయి, అది శత్రువుల హృదయాలను లోలోపలే కదిలించివేసింది.

హజ్రత్ మసీహ్ మౌవుద్ (అలైహిస్సలాం) ఇంకా ఇట్లు ప్రవచించారు. మన నాయకుడు, చివరి ప్రవక్త మరియు నిష్టాపరులందరికీ ఆదర్శమైన దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లంకు అల్లాహ్ తఆలా అన్ని రకాల సహాయ సహకారాలను అందించి విజేతగా నిలిపాడు. ప్రారంభంలో హజ్రత్ మూసా అలైహిస్సలాం, హజ్రత్ ఈసా అలైహిస్సలాం వలె ఆయన (స) కూడా వలస బాధను అనుభవించాల్సి వచ్చింది, కానీ ఆ వలసలోనే విజయానికి, సహాయానికి పునాదులు దాగి ఉన్నాయి. ఓ మిత్రులారా! నిశ్చయంగా నమ్మండి, నిష్టాపరులు ఎన్నడూ నాశనం చేయబడరు. రెండు వర్గాలు పరస్పరం శత్రుత్వంతో ఉండి ఆ విరోధం గరిష్ట స్థాయికి చేరుకున్నప్పుడు అల్లాహ్ తఆలా దృష్టిలో ఏ వర్గమైతే భక్తి మరియు నిష్టాపరత కలిగి ఉంటుందో, వారి కోసం ఆకాశం నుండి సహాయం అందుతుంది. ఈ విధంగా ఆకాశవాణి తీర్పు ద్వారా మతపరమైన వివాదాలు పరిష్కరించ బడతాయి.

వారిట్లనిరి. వైభవోపేతుడైన అల్లాహ్ మన ప్రవక్త గారినుద్దేశించి ఇట్లు ఆదేశించాడు. **'వ ఇన్నక ల అలా ఖులుకిన్ అజీమ్'**. అనగా నిశ్చయంగా నీవు అత్యున్నత నైతిక విలువలను కలిగి ఉన్నావు. దీని అర్థమేనగా అన్ని రకాల ఉత్తమ గుణాలు ఆయనలో ఇమిడి ఉన్నాయి. క్లుప్తంగా చెప్పాలంటే మనిషి హృదయంలో ఉండే శక్తులన్నీ అనగా అన్ని సహజ ప్రవృత్తులు, బుద్ధి, వివేకముతో కూడిన ఆలోచనతో ఆయా సందర్భానుసారంగా వ్యక్తపరచబడినప్పుడు వాటినే సద్గుణాలని పిలుస్తారు.

దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఈ లోకంలో సత్యాన్ని వ్యాప్తి చేయడానికి వచ్చారు, అందుకే వివిధ సందర్భాల్లో ఆయన తన అనుచరులకు కూడా సత్యాన్ని అవలంబించాలని బోధించారు. ఒక సందర్భంలో దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఇలా ఉపదేశించారు.

మీరు సత్యాన్నే పలకడం తప్పనిసరి. ఎందుకంటే సత్యం పుణ్యం వైపు నడిపిస్తుంది మరియు పుణ్యం స్వర్గం వైపునకు దారి తీస్తుంది. ఒక వ్యక్తి నిరంతరం నిజమే మాట్లాడుతుంటే, సత్యాన్వేషణలోనే నిమగ్నమై ఉంటే చివరికి అల్లాహ్ వద్ద అతను సత్యసంధుడని వ్రాయబడతాడు. మీరు అబద్ధానికి దూరంగా ఉండండి, ఎందుకంటే అబద్ధం దుర్మార్గానికి దారి తీస్తుంది మరియు దుర్మార్గం నరకాగ్ని వైపునకు నెడుతుంది. ఒక మనిషి అబద్ధాలు చెప్తూనే ఉంటే చివరికి అతను అల్లాహ్ దృష్టిలో పెద్ద అబద్ధాలకోరని వ్రాయబడతాడు. మరొక సందర్భంలో ఆయనిలా ఉపదేశించారు. నిశ్చయంగా అబద్ధం ఏ పరిస్థితిలోనూ సరైనది కాదు. అది గంభీరంగా చెప్పినా లేదా తమాషాకు చెప్పినా సరే. అలాగే ఒక వ్యక్తి తన బిడ్డకు ఏదైనా వాగ్దానం చేసి దానిని నెరవేర్చకపోవడం కూడా అబద్ధం కిందకే వస్తుంది.

అల్లామా రాజీ రహ్మతుల్లాహి అలైహి అత్తౌబా అధ్యాయంలోని 119వ సూక్తిని వివరిస్తూ ఒక సంఘటనను ఇలా ప్రస్తావించారు. ఒక వ్యక్తి పవిత్ర ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం వద్దకు వచ్చి ఇట్లన్నాడు: నేను నాలోని చెడుల నుండి దూరంగా ఉండాలని కోరుకుంటాను, కానీ నాలో మద్యపానం, దొంగతనం, వ్యభిచారం, అబద్ధం చెప్పే అలవాట్లు చాలా ఎక్కువగా ఉన్నాయి. మీరు వీటిని నిషిద్ధం అని ప్రకటించారని ప్రజలు చెబుతున్నారు. వీటన్నింటినీ ఒక్కసారిగా వదిలివేసే శక్తి నాకు లేదు. మీరు వీటిలో ఏదో ఒకదాని విషయంలో నాకు మినహాయింపునిస్తే, నేను మీపై విశ్వాసం ప్రకటించగలను. దానికి మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం సరే, అయితే నీవు అబద్ధం చెప్పడం వదిలివేయమని ఆదేశించారు. అతను అబద్ధం చెప్పనని వాగ్దానం చేసి ముస్లిం అయ్యాడు. ఆ తర్వాత అతను మహా

ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం వద్ద నుండి వెళ్ళినప్పుడు, అతనికి ఆ పాత చెడు పనులన్నీ చేసే అవకాశాలు ఎదురయ్యాయి. కానీ ఒకవేళ నేను ఈ చెడు పనుల్లో నిమగ్నమైతే మరియు మహా ప్రవక్త నన్ను అడిగితే, నేను ఖచ్చితంగా నిజమే చెప్పాలి కదా అని ఆలోచించి ఆ భయంతో అతను వాటన్నింటికీ దూరంగా ఉంటూ వచ్చాడు.

హజ్రత్ అబూబకర్ సిద్దీక్ రజియల్లాహు అన్హు కు మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ప్రవక్తగా ప్రకటించుకున్న విషయం తెలిసినప్పుడు ఆయన దైవ ప్రవక్త వద్దకు వచ్చి ఇలా విన్నవించారు: మీ గురించి నాకొక విషయం తెలిసింది. దానికి ఆ ప్రవక్త (స) ఓ అబూబకర్! నా గురించి నీకేమి తెలిసింది? అని అడిగారు. హజ్రత్ అబూబకర్ రజియల్లాహు అన్హు ఇలా అన్నారు: మీరు ప్రజలను దైవ ఏకత్వం వైపు పిలుస్తున్నారని మరియు మీరు అల్లాహ్ ప్రవక్త అని చెబుతున్నారని విన్నాను. దైవ ప్రవక్త (స) ఇట్లనిరి. అవును! నా అల్లాహ్ నన్ను శుభవార్త వినిపించేవాడిగా మరియు హెచ్చరించేవాడిగా పంపాడు. నన్ను ఇబ్రాహీం అలైహిస్సలాం చేసిన దుఆకు ప్రతిరూపంగా మార్చాడు మరియు యావత్ మానవాళి కోసం నన్ను పంపాడు. అప్పుడు హజ్రత్ అబూబకర్ రజియల్లాహు అన్హు ఇలా అన్నారు: అల్లాహ్ సాక్షిగా! నేను మిమ్మల్ని ఎప్పుడూ అబద్ధం చెప్పడం చూడలేదు. మీలోని నమ్మకత్వం, బంధుత్వాలను గౌరవించడం, మీ సత్కార్యాల కారణంగా మీరే ప్రవక్త పదవికి అత్యంత అర్హులు. మీ హస్తం ఇవ్వండి నేను మీతో బైఅత్ ప్రతిజ్ఞ చేస్తాను. దీనిపై దైవ ప్రవక్త (స) తన పవిత్ర హస్తాన్ని ముందుకు చాచగా హజ్రత్ అబూబకర్ రజియల్లాహు అన్హు ఆయన హస్తమున బైఅత్ చేశారు.

దైవవాణి ప్రారంభమైన సందర్భంలో హజ్రత్ ఖదీజా రజియల్లాహు అన్హా దైవ ప్రవక్త (స) గారి నమ్మకత్వం, సత్యత గురించి పలికిన గొప్ప మాటలను ప్రస్తావిస్తూ, హజ్రత్ ఖలీఫతుల్ మసీహిల్ అవ్వల్ (రజి) ఇట్లనిరి. ఒక యాభై ఏళ్ల వయసున్న మహిళ, అదే నగరానికి చెందినవారు, అదే జాతికి చెందినవారు, 15 సం॥లుగా ఆయనతో వివాహ బంధంలో ఉన్నవారు ఎలాంటి సాక్ష్యాన్ని ఇస్తున్నారో ఆలోచించండి! దైవ ప్రవక్త ఎంతో ఆవేదన, ఆందోళనలో ఉన్న సమయంలో హజ్రత్ ఖదీజా (రజి) ఇచ్చిన ఆ సాక్ష్యం ఎంతో లోతుగా ఆలోచించదగ్గది. ఆయనలో ఆ గుణాలు గనుక ఉండక పోతే ఖదీజా (రజి) మాటలు ఆ సమయంలో నాయనకు ఎంతమాత్రం ఊరటనిచ్చేవి కావు.

అబూ తాలిబ్ లోయలో దిగ్బంధం (బహిష్కరణ) జరిగి మూడవ సంవత్సరం పూర్తికావస్తున్న తరుణంలో అల్లాహ్ తఆలా ద్వారా సమాచారం పొందిన దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం తన చిన్నాన్న అబూ తాలిబ్‌కు ఇలా తెలిపారు. కాబా ప్రార్థనాలయంలో వేలాడదీసిన బనూ హాషిమ్ బహిష్కరణ ఒప్పంద పత్రంలోని 'అల్లాహ్' పేరు మినహా మిగిలిన రాతనంతటినీ చెదలు తినేశాయి. హజ్రత్ అబూ తాలిబ్‌కు దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం మాటల మీద ఎంతటి నమ్మకం ఉందంటే, ఆయన తన సోదరులతో ఈ విషయాన్ని ప్రస్తావిస్తూ ఇలా అన్నారు. ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) నేటి వరకు నాతో ఒక్క అబద్ధం కూడా చెప్పలేదు. తదనంతరం ఆయన వారితో కలిసి ఖురైషీల నాయకుల వద్దకు వెళ్లి ఇలా చెప్పారు. నా సోదరుని కుమారుడు నాకీ విషయం చెప్పాడు, అతను నాతో ఎప్పుడూ అబద్ధం చెప్పలేదు. ఒకవేళ నా సోదరుని కుమారుడు చెప్పింది నిజమైతే, మీరు మీ బహిష్కరణ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి. ఒకవేళ అతను చెప్పింది అబద్ధమైతే నేను అతడిని మీకప్పగిస్తాను. మీరు అతడిని చంపినా సరే, బ్రతకనిచ్చినా సరే. తీరా ఆ ఒప్పంద పత్రాన్ని పరిశీలించగా దైవ ప్రవక్త (స) చెప్పినట్లుగానే అది ఉంది. దీనితో ఖురైషీలు తమ జాతి ముందు తలదించుకుని సిగ్గుపడ్డారు.

హుజూరె అన్వర్ ఇట్లనిరి. అబూ జహల్ హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం

గారికి ఎంతటి శత్రువో మనకు తెలుసు. కానీ ఒక సందర్భంలో అతను కూడా పలికిన మాటలను హజ్రత్ ముస్లిహ్ మౌఊద్ (రజి) ఇట్లు వివరించారు. మేము నిన్ను అబద్ధాలకోరని అనడం లేదు కానీ నీవు ప్రబోధిస్తున్న ఈ బోధనలను మాత్రం మేము తిరస్కరిస్తున్నాము. అంటే అబూ జహల్ అంతటి బద్ధ శత్రువు, కఠిన హృదయుడి మనసు కూడా హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం గారిని అబద్ధాలకోరని అనడానికి సిద్ధపడలేదు. ఉమయ్య ఇబ్న్ ఖలఫ్ కూడా ఆయనకు తీవ్రమైన వ్యతిరేకి, కానీ ఒకానొక సమయంలో అతని నోటి నుండి కూడా ఈ మాటలు వచ్చాయి. అల్లాహ్ సాక్షిగా! ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఏదైనా మాట్లాడితే అది నిజమే అయి ఉంటుంది, ఆయన అబద్ధం చెప్పడు. నిజమైన గొప్పతనం అంటే శత్రువుల చేత కూడా మెప్పు పొందడమే. హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం గారి వ్యక్తిత్వం ఎంతటి మహోన్నతమైనదంటే, ఆయన తన శత్రువుల చేత కూడా తన సత్యతను మరియు ధర్మనిరతిని అంగీకరింపజేశారు.

మదీనాలోని యూదుల సాక్ష్యం కూడా మనకు కనిపిస్తుంది. ముస్లింలకు మరియు యూదుల తెగ అయిన బనూ ఖురైజాకు మధ్య పరస్పర సహకార ఒప్పందం ఉండేది. అహ్జాబ్ యుద్ధ సమయంలో, బనూ నజీర్ నాయకుడైన హుయ్యి బిన్ అఖ్తబ్, బనూ ఖురైజా నాయకుడైన కాబ్ బిన్ అసద్ వద్దకు వెళ్లి ముస్లింలను ఓడించడానికి వారితో ఉన్న ఒప్పందాన్ని ఉల్లంఘించి ఖురైషీలకు సహాయం చేయమని ప్రేరేపించడానికి ప్రయత్నించాడు. ఆ సమయంలో ముస్లింలకు శత్రువైన కాబ్ బిన్ అసద్ ఇట్లన్నాడు: నేను ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) తో ఒప్పందం చేసుకున్నాను, నేనేమాత్రం ఆ ఒప్పందాన్ని ఉల్లంఘించను. ఎందుకంటే ఆయనలో నేను విశ్వసనీయత, సత్యత తప్ప మరేమీ చూడలేదు.

హుజూరె అన్వర్ ఇట్లనిరి. ఒక సందర్భంలో దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఇట్లనిరి. నేను ఖచ్చితంగా నవ్విస్తాను, కానీ అందులో కూడా నిజం మాత్రమే ఉంటుంది. ఇంకా ఆయనిలా అన్నారు. ప్రజలను నవ్వించడం కోసం అబద్ధాలు మాట్లాడుతూ మాట్లాడే వ్యక్తికి వినాశనం తప్పదు.

హజ్రత్ ముస్లిహ్ మౌఊద్ (రజి) ఇట్లనిరి. సత్యం విషయంలో పవిత్ర ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం వ్యక్తిగత స్థానం ఎంతటి ఉన్నతమైనదంటే, ఆయన జాతి వారే ఆయనకు సత్యసంధుడని పేరు పెట్టారు. ఆయన తన సమాజాన్ని కూడా ఎల్లప్పుడూ సత్యంపై నిలకడగా ఉండాలని హితవు పలికేవారు. సత్యమే పుణ్యం వైపు దృష్టిని మళ్ళిస్తుంది మరియు పుణ్యమే మనిషికి స్వర్గాన్ని ప్రసాదిస్తుంది. ఒక మనిషి నిరంతరం నిజం మాట్లాడుతూ ఉంటే, చివరికి దేవుని సన్నిధిలో కూడా అతను సత్యవంతుడిగా పరిగణించబడటమే సత్యపు అసలు లక్ష్యమని ఆయన తరచుగా సూచించేవారు.

హుజూరె అన్వర్ ఇట్లనిరి. మన సత్యత ప్రమాణాలు ఎలా ఉన్నాయని నేడు ప్రతి అహ్మదీ తనను తాను పరిశీలించుకోవలెను. మనలో ఉన్న బలహీనతలను మనం తొలగించుకోవలెను.

ఖుత్బా చివరలో హుజూరె అన్వర్ శ్రీమతి షాహిదా అహ్మద్ గారి (గౌ॥ మిర్జా నసీమ్ అహ్మద్ గారి సతీమణి) సద్గుణాలను ప్రస్తావించి ఆమె పరోక్ష అంత్యక్రియ ప్రార్థన చదివిస్తానని ప్రకటించారు.

اَلْحَمْدُ لِلّٰہِ نَحْمَدُہٗ وَنَسْتَعِیْنُہٗ وَنَسْتَغْفِرُہٗ وَنُؤْمِنُ بِہٖ وَنَتَوَکَّلُ عَلَیْہِ۔ وَنَعُوْذُ بِاللّٰہِ مِنْ شُرُوْرِ اَنْفُسِنَا وَمِنْ سَیِّئَاتِ اَعْمَالِنَا۔ مَن یَّھْدِہِ اللّٰہُ فَلَا مُضِلَّ لَہٗ وَمَنْ یُّضْلِلْہُ فَلَا ھَادِیَ لَہٗ۔ وَنَشْھَدُ اَنْ لَّآ اِلٰہَ اِلَّا اللّٰہُ وَنَشْھَدُ اَنَّ مُحَمَّدًا عَبْدُہٗ وَرَسُوْلُہٗ۔ عِبَادَ اللّٰہِ رَحِمَکُمُ اللّٰہُ! اِنَّ اللّٰہَ یَاْمُرُ بِالْعَدْلِ وَالْاِحْسَانِ وَاِیْتَآءِ ذِی الْقُرْبٰی وَیَنْھٰی عَنِ الْفَحْشَآءِ وَالْمُنْکَرِ وَالْبَغْیِ۔ یَعِظُکُمْ لَعَلَّکُمْ تَذَکَّرُوْنَ۔ اُذْکُرُوا اللّٰہَ یَذْکُرْکُمْ وَادْعُوْہُ یَسْتَجِبْ لَکُمْ وَلَذِکْرُ اللّٰہِ اَکْبَرُ۔